# గెలుపు

రామకృష్ణ, రమ, బీచ్‌లో సముద్రానికి కాస్తంత దూరంలో కూచున్నారు. చల్లనిగాలి అహ్లాదాన్ని కలిగిస్తూ ఉంటే, చిందరవందరగా ఎగిరి మొహం మీద పడుతోన్న ముంగురుల్ని సుతారంగా వెనక్కి నెట్టుతోంది రమ. ఉవ్వెత్తున లేచి పడుతోన్న కెరటాల్ని తదేకంగా చూస్తోంది. కెరటాలు సృష్టిస్తోన్న సంగీతము, మనస్సుని ఉత్తేజ పరుస్తోంది. దూరంలో రేడియోలోంచి సినీమా పాటలు విన్పిస్తున్నయ్.

రామకృష్ణ ఇవన్నీ పట్టించుకోవడం లేదు. రమ అందాన్ని రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

"దర్మం సెయ్యండమ్మా!" దీనాతి దీనమైన ఓ స్వరం విని, అటు కేసి చూసింది రమ.

ఎదురుగా వికలాంగుడైన ఓ వ్యక్తి దేకుతూ వచ్చి చేయి చాచడం గమనించింది. ఆమె హృదయం కలుక్కుమంది. వానిటీ బాగ్‌లోంచి

పది పైసల నాణెం తీసి వాడి చేతిలో పెట్టింది. వాడు కృతజ్ఞతాభివందనం చేస్తూ, వెళ్ళిపోయాడు.

"పాపం!" అన్న పదం ఆమె నోట వెలువడింది, వెళ్ళిపోతున్న ఆ వికలాంగుణ్ణి చూస్తూనే.

"పాప మేవిఁటి?" అన్నాడు రామకృష్ణ.

"వాణ్ణి చూశారు కదా! పూర్వ జన్మలో వాడేం పాపం చేశాడో?" నిట్టూరుస్తూ అంది, రమ.

"వీడి విషయం ఏమో గాని, ఈ మధ్య నేను పేపర్లో చదివాను—కల్తీ నూనె వాడిన కొందరు వ్యక్తులు అంగ వైకల్యం పొందినట్టు; అటువంటి వాడే వీడూ కావొచ్చు.... కాకపోనూ వొచ్చు. ఏది ఏమైనా ఈ రోజుల్లో వ్యాపారస్తులున్నారే, దేశానికి చీడపురుగుల్లా తయారయ్యారు. తోటి మానవుల్ని పీల్చి పిప్పి చేస్తున్నారు." ఆవేశంలో అనేశాడు గాని, అంతలోనే గుర్తుకొచ్చింది, రమ తండ్రి పెద్ద వ్యాపారస్తుడని. చప్పున తన తప్పుని సరిదిద్దుకున్నాడు. "ఐ యామ్ సో సారీ రమా! జనరల్‌గా అనేశాను. మరేం అనుకోకు" అంటూ క్షమాపణ చెప్పుకున్నాడు.

రమ నవ్వేసింది. నవ్వుతోన్న ఆమె మరీ అందంగా అగుపించింది, రామకృష్ణకి.

"జనరల్‌గా అన్నా, ప్రత్యేకించి మా నాన్నగార్ని అన్నా నేనేం బాధ పడను రామం. ఎందుకూ అంటే, నువ్వు చెప్పింది నూరుపైసల నిజం గాబట్టి; మా ఇంట్లో మేం వాడుతోన్న నూనె గాని, నెయ్యి గాని మా నాన్నగారు అమ్ముతున్న సరుకు కాదు. అవి ప్రత్యేకమైనవి. కల్తీ సరుకు అమ్మడం తెలుసుగాని, తినడం ప్రమాదకరమనికూడా తెలుసుగా! అందుకే మా ఇంట్లో వాడం. హోల్‌సేల్ మర్చెంటుగా మా నాన్న ఏవిఁటేవిఁటి చేస్తున్నారో వివరాలు తెలీవు గాని, ఆయన చేస్తున్నది అన్యాయమని, ప్రజా ద్రోహమని, ఆ విధంగా దేశ ద్రోహమని తెలుసు. అందుకనే మా నాన్నగార్ని నేను అసహ్యించుకుంటాను" అంది, రమ.

రామకృష్ణ, ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు.

"నో—నో....అది చాలా తప్పు రమా! ఎవరి వృత్తిని వాళ్ళు మానేయడం అంత సులభ సాధ్యమా? ఈనాడు నువ్వీ టెరీన్ చీర కట్టావూ

అంటే, మంచి ముత్యాల హారం వేసుకున్నావూ అంటే, మీ నాన్నగారు డబ్బు గలవారై ఉండటం వల్లనే కదా! అంచేత, ఇంకెవరైనా ఆయన్ని ఏ విధంగా నిందించినా నిందించవచ్చు గాని నువ్వు మాత్రం నిందించ కూడదు...." అన్నాడు.

చప్పున అందుకుంది రమ. "అని నువ్వంటున్నావు. కాని, అది నీ హృదయపు లోతుల్నించి రాలేదు. కేవలం నన్ను తృప్తి పర్చడానికి, నాకు కోపం రాకుండా ఉండడానికి అంటున్నావు. అంతే!" అంది విసురుగా.

"నన్ను నువ్వు అర్థం చేసుకోవడం లేదు రమా! మీ నాన్నగారు ఏదో విధంగా డబ్బు గడిస్తున్నారు గాబట్టే, నువ్వు సుఖ జీవనాన్ని సాగిస్తున్నావు. అందుకే ఆయన్ని నిందించొద్దంటున్నాను. మీ అందరి సుఖం కోసమే కదా ఆయన తాపత్రయం....? కొన్నాళ్ళకి, ఆయన నిన్ను మరో పెద్ద వ్యాపారునికిచ్చి పెళ్ళి చేస్తారు, అప్పుడు కాదనగలవా? నీ అదృష్టాన్ని వొదులుకోగలవా?"

రమ తృళ్ళిపడినట్టు రామకృష్ణ కేసి చూసింది.

"ఏవిఁటీ? నా పెళ్ళి పెద్ద వ్యాపారస్తునితోనా? అంటే, నన్ను దూరం చేసుకోవాలని నీ ప్రయత్నమా?" చిరు కోపంతో అంది.

రామకృష్ణ, మెల్లగా ఓ నిశ్వాసం విడిచాడు. "నా ప్రయత్నం కాదు రమా! మీ నాన్నగారి ప్రయత్నం. ఆయన, బియ్యం వ్యాపారస్తుడు భీమశంకరం కొడుక్కి నిన్నిచ్చి వివాహం చెయ్య నిశ్చయించినట్టు నాకు తెలిసింది. వాళ్ళకి బోలెడు డబ్బుందిలే."

"అయితే, పెళ్ళి చేసుకోమంటావా? పెంకిగా ప్రశ్నించింది.

"నీ యిష్టం. నేనేం చెప్పగల్ను?"

"నేను, నీకు తగిన అర్ధాంగిని కాలేనని నువ్వు చెప్పేస్తే, మానాన్న నిర్ణయించిన సంబంధాన్ని అంగీకరిస్తాను...."సూటిగ రామకృష్ణ మొహం లోకి చూస్తూ అందామె.

రామకృష్ణ ఇరకాటంలో పడ్డాడు. "అదేం మాట రమా? నేనే నీకు తగిన వాణ్ణి కానేమో! నా లాంటి ఓ సామాన్యమైన లెక్చెరర్‌తో

నీ వివాహాన్ని మీ నాన్న జరిపిస్తారంటే, నాకు నమ్మకం లేదు .... నాకేం ఆస్తి లేదు.... బ్యాంకు బేలన్స్ అంతకంటె లేదు. నా చదువే నా ఆస్తి!"

"మా నాన్నగారు అంగీకరించకపోతే, నష్టమేం లేదు రామం నీ ఇల్లు నాకు తెలుసు.... వచ్చేయగల్ను."

"మన మీద పగబట్టి, ఏ విధమయిన చర్యకైనా దిగుతారేమో మీ నాన్నగారు?"

"అన్నీ ఆలోచించాను రామం. మన సాన్నిహిత్యాన్ని సురక్షితంగా, సుస్థిరంగా ఉంచగలిగే ధైర్యం, గుండె నిబ్బరం, చొరవ నీలో ఉండాలి. అప్పుడెవ్వరూ మనల్నేమీః చెయ్యలేరు...."

"అందుకు సిద్ధమే నేను ..."

"మరింకేం? మనం వెనుకంజ వెయ్యకూడదు ..." అనేసింది రమ, ఎంతో నిబ్బరంగా.

రామకృష్ణ, తృప్తిగ నిట్టూర్పు విడిచాడు. మరి కాస్సేపటికి ఇద్దరూ బైలుదేరి ఇంటి ముఖం పట్టారు.

* * *

అయిదు రోజులు ఇట్టే గడిచిపోయినయ్. మధ్యాహ్నం విశ్రాంతి తరువాత, కాఫీ తీసుకుంటూ, ఎదురుగా ఉన్న కూతుర్ని ఉద్దేశించి ఇలా అన్నాడు, రామదాసు.

"అమ్మాయ్, నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా! భీమశంకరం గారని ఇక్కడే ఓ పెద్ద వ్యాపారస్తుడున్నాడులే! నువ్వు పేరు వినే ఉంటావు. అతని ఏకైక పుత్రుడు బి. ఎ. పాసై, ఉద్యోగంచేసే అవసరం లేకపోవడంతో, తండ్రికి వ్యాపార వ్యవహారాల్లో సహకరిస్తున్నాడు. ఆ అబ్బాయి నిన్ను వివాహం చేసుకోవాలన్న సంకల్పంతో వున్నాట్ట. భీమ శంకరంగారు నన్నడిగారు. ఇంత గొప్ప సదవకాశాన్ని వొదులు కుంటామా? మాటిచ్చేశాను. అయితే, నీ అభిప్రాయం కూడా తీసుకో వాలిగా! నువ్వు కాదనవనే నా అభిప్రాయం."

రమ ఆశ్చర్యపోలేదు. ఎందుకూ అంటే, ఇటువంటి ప్రయత్నం సాగుతున్నట్టు, రామకృష్ణద్వారా వింది మరీ! ధైర్యాన్ని చిక్కపట్టుకుంది.

"కల్తీ నూనె, నెయ్యి మొదలైనవి అమ్మి, ప్రజలను మోసగిస్తూ,

తీరని ద్రోహం చేస్తూ, డబ్బు గడిస్తున్నానన్న తృప్తిలో, మీరు పాపాన్ని మూట గట్టుకుంటున్నారన్న నిజాన్ని మరిచిపోతున్నారు. మీకు తోడుగా, బియ్యంలో రాళ్ళు కలిపి, ప్రజల కళ్ళల్లో దుమ్ము కొడుతూ, లక్షలు గడిస్తూన్న ఆ భీమశంకరంనే మీరు వియ్యంకుడిగా ఎన్నుకోవడం ఆశ్చర్యమేం లేదు. సమాన వియ్యమే మరి! కాని, నేను మాత్రం యీ వివాహానికి అంగీకరించను. ప్రజల జీవితాలతో చెలగాటమాడే రాతి గుండె గల వాళ్ళింట్లో కోడలిగా అడుగు పెట్టను" అంది, నిస్సంకోచంగా.

రామదాసు, నివ్వెరపోయాడు. తన కూతురు రమయేనా మాట్లాడుతున్నది? ఆమెకేం మతి చెడలేదు కదా అనుకున్నాడు.

"ఏమిటి రమా ఆ మాటలు? ఇవ్వాళ, నీకేం మతిగాని పోయిందా? లేకపోతే, ఆ రామకృష్ణ మాయలోపడి, నీ అంతస్తునే మర్చిపోతున్నావా?" అన్నాడు కాస్త సీరియస్‌గా మొహం పెట్టి.

"ఆయన మాయలో కాదు నాన్నా! ఆయన మమతలో పడ్డాను. ఆయనంటే, నాకు అభిమానం .... గౌరవం. అన్నింటిని మించిన అనురాగం. ఆయన్నే నేను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను" నిష్కర్షగా చెప్పింది, రమ.

రామదాసు, మరీ విస్తుపోయాడు....అతని కళ్ళల్లో అప్రయత్నంగా ఎర్రదనం చోటు చేసుకుంది. కూతురి మొహంలోకి తీక్షణంగా చూశాడు.

"ఏమిటీ? ఆ దరిద్రుణ్ణి నువ్వు పెళ్ళి చేసుకుంటావా?" రెచ్చిపోతూ విసురుగా అన్నాడు.

రమ భయపడలేదు.

"ఆయనేం దరిద్రుడు కాదు నాన్నా! మీలా ఆయనకి పాపపు డబ్బు లేకపోవచ్చు. కాని ఆయన చదువుకున్నాడు. గౌరవనీయమైన లెక్చరర్ ఉద్యోగం చేసుకొని, నీతిగా, నిజాయితీగా బ్రతుకుతున్నాడు. నన్ను పోషించగల శక్తి, ఆయనకి లేకపోలేదు." నిర్భయంగా అంది.

రామదాసు మొహం జేవురించింది. కళ్లు నిప్పు కణాల్లా మెరుస్తున్నయ్.

"అయితే, నేను వాళ్ళకిచ్చిన మాట పొల్లు కావల్సిందేనా?" అతని గొంతు గర్జించింది.

"అది నా తప్పు కాదు నాన్నా! మీ మాట నిలబెట్టడం కోసం, నా జీవితాన్ని నాశనం చేసుకునేటంతటి అమాయకురాల్నేంకాదు నేను. నాకూ కొన్ని ఆశయాలున్నయ్."

"ఇదే నీ ఆఖరి నిర్ణయమా?" కోపంతో అతని స్వరం ఖంగుమంది.

"నిర్ణయం ఎప్పుడూ ఒకేసారి తీసుకోవడం జరుగుతుంది నాన్నా! ముఖ్యంగా వివాహ విషయంలో. దానికి మార్పంటూ ఉండదు." ఎంత గర్జించినా తనేం భయపడదన్నట్టుగ మెల్లగా చెప్పింది.

ఉద్రిక్తతతో వూగిపోయాడు రామదాసు.

"సరే! నిర్ణయాన్ని నువ్వు తీసుకోవడమే కాదు .. నేనూ తీసుకో గలను. ఆ భీమశంకరం గారబ్బాయితోనే నీ పెళ్ళి జరుగుతుంది. నువ్వెలా కాదంటావో నేనూ చూస్తాను. ఈ రోజునించీ, నువ్వా రామకృష్ణతో తిరక్కు.... అర్థమయ్యిందా?" గర్జించాడు.

తేలిగ్గా నవ్వేసి, అక్కణ్ణించి జారుకుంది రమ.

కూతురు అలా నవ్వినందుకు మండిపడ్డాడు రామదాసు. అదో ఛాలెంజిగా భావించాడు. ఎలాగైనా రమను, భీమశంకరం కోడలిగా చెయ్యాలి.... అన్న పట్టుదల, అతనిలో పరాకాష్ఠ నందుకుంది.

* * *

మరుసటి రోజు తెల్లవారేసరికి, రమ ఆమె పడక గదిలో అగుపించ లేదు. తల్లి బావురుమంది. రామదాసు కూడా కంగారుపడ్డాడు. అయితే, ఆ కంగారులో అధికపాళ్లు కోపమే ఉంది.

"అది ఆ త్రాష్టుడి దగ్గరికే వెళ్ళుంటుంది." కాస్తంత నిబ్బరపడు తూనే అనేసి, రమ మంచం తలగడ కింద దొరికిన ఉత్తరాన్ని చదువు కున్నాడు. కోపంతో వణికిపోయాడు. అందులో యిలా వుంది:

"పూజ్యులు నాన్న గారికి,

నమస్కారములు.

మీతో పంతం బట్టి, నేను ఇంట్లోంచి వెళ్తున్నానని మీరనుకుంటే, అది శుద్ధ పొరపాటు. నా అభిప్రాయాన్ని, మీతో చెప్పాను. అప్పటికే నా వివాహం రామకృష్ణతో దైవ సాన్నిధ్యంలో జరిగింది. అందుకు తగిన ఆధారాలున్నయ్. ఈ విషయంలో మీరు మా మీద పగబట్టి, మాలో ఎవరి

కయినా ఏ విధమైన అపకారం జరిపినా, మీ మీద పోలీసువారు చర్య తీసుకుంటారు. అటువంటి ఏర్పాట్లు జరిగాయి. అంచేత, అటువంటి తెలివిహీనమైన ప్రయత్నాలు చేసి, ఇప్పటికే ప్రజల శాపనార్థాలందుకుంటున్న మీరు, మరీ నవ్వులపాలు కావద్దు. ఇదే నా కోరిక. మనిషికి కావల్సింది కేవలం డబ్బే కాదు నాన్నా! మానవత్వం, మంచి మనసూ ఉండాలి. అప్పుడే మనస్సుకి ఓ విధమయిన తృప్తి, ఆనందం ఉంటాయి. డబ్బున్నా, యీ రెండూ మీలో పూజ్యం .... మీరు మనసు మార్చుకొని, నా దగ్గరికి వచ్చిననాడే మనింట్లో నేను అడుగు పెడతాను. అమ్మకి నా నమస్కారములు.

ఇట్లు,

రమ—"

"ఉత్తరం రాయడంలో కూడా ఎంత అహంభావం?" పళ్ళు పటపటా కొరికాడు రామదాసు.

"అమ్మాయి ఇంట్లోంచి వెళ్ళిపోయిందన్న విచారానికి బదులు కోపగించుకుంటున్నారా? మీకు హృదయం లేదండీ: రాతిగుండె మీది...." అంది భార్య రుద్ధ కంఠంతో.

"పోతే పోనీ! ఇటువంటి కూతురు వున్నా ఒహటే .... లేకున్నా ఒహటే! నాకు కూతురే లేదనుకుంటాను...." ఉక్రోషంతో అంటూ, ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించి ఓ మూలకి విసిరేసి, విసురుగా వెళ్ళిపోయాడు.

అతని భార్య కంట తడి పెట్టుకుంది. ఇంతకంటె ఆమె చెయ్యగలిగిందేమీ లేదు పాపం.

*　　*　　*

రోజులూ, నెలలూ నిర్విరామంగా సాగిపోతున్నాయ్. ప్రభుత్వ విధానాల్లో చాలా మార్పు లొచ్చినయ్. తత్ఫలితంగా రామదాసు లాంటి చాలా మంది వ్యాపారస్తుల్ని కల్తీ సామాన్లు అమ్మినందుకు, యింకా లాభాలు గడించాలన్న ఉద్దేశంతో చాలా సామానుల్ని గోదాముల్లో దాచినందుకు, అరెస్టు చేశారు. ఆ విషయం తెలిసి వెంటనే అక్కడికి వచ్చింది

భర్తతోపాటు రమ. చేతులకి బేడీలు వేయబడ్డ తండ్రిని చూసింది. ఆమె హృదయంలో ఎక్కడో బాధ కలిగింది. అయినా నిభాయించుకుంది. కూతుర్ని చూసి మొహం దించుకున్నాడు, రామదాసు.

"నాన్నా! మీ మీద తండ్రి అనే గౌరవము తప్పించి, మరెటువంటి సానుభూతీ లేదు. మీరు చేసిన అన్యాయాలవల్ల, ఎంతమంది ప్రజలు వికలాంగులయ్యారో, అనారోగ్యంతో బాధ పడుతున్నారో వూహించడం కష్టం. ఆ పాపాలకి ప్రాయశ్చిత్తం ఇది చాలదనుకుంటాను. వెళ్ళండి.... కట కటాల వెనుక కొన్నాళ్ళుండి, మనస్సుని మరమ్మత్తు చెయ్యండి. మారండి. మనిషికి డబ్బే ప్రధానం కాదన్న నిజాన్ని తెలుసుకోండి...." అంది కసిగా.

కన్న కూతురు, తండ్రిని యిలా అంటూ వుంటే, అక్కడ చేరిన వాళ్ళందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. రామదాసు మీద యెవ్వరికీ సానుభూతి లేదుగా.... కొందరు నవ్వేరు.

రామదాసు కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. తన చుట్టూ చేరిన మనుషుల సానుభూతి యెట్టాగూ లేదు. చివరికి తన కూతురి సానుభూతిని కూడా పొందలేని తన జీవితం నిరర్థక మనుకున్నాడు. "అమ్మా, రమా, నేను పాపాత్ముణ్ణే నమ్మా! వ్యాపార రీత్యా ఎన్నో ఘోరాలు చేశాను. ప్రజల్ని మోసం చేశాను. పీడించాను. నేను పాపం చేస్తున్నానని తెలిసి కూడా ధనాశ దయ్యాన్ని వదిలించుకోలేక పోయాను. చివరికి కన్న కూతురివయిన నిన్ను దూరం చేసుకున్నాను. ఈ శిక్ష చాలదమ్మా! నన్ను క్షమించమ్మా రమా! నువ్వే గెలిచావు. నీ నిర్ణయాన్ని నేను మనస్ఫూర్తిగ అభినందిస్తున్నాను. నువ్వూ, రామకృష్ణ మనింట్లోనే ఉండండి, అమ్మనీ, తమ్ముళ్ళనీ, చెల్లెల్నీ దిక్కులేనివారిగా చెయ్యకండి." అంటూ బావురు మన్నాడు.

ఎంతయినా రమ స్త్రీ. ఆయన కన్న కూతురు, ఆమెలోని స్త్రీ మనస్సు కరిగిపోయింది. ఆమె కళ్ళ వెంబడి అశ్రువులు జారి పడినయ్. మాట్లాడలేకపోయింది.

"వస్తానమ్మా...." రుద్ధ స్వరంతో అంటూ పోలీస్ వేన్‌లోకి వెళ్ళిపోయాడు మొహం దాచుకుంటూ రామదాసు.

భార్యా, పిల్లల ఆక్రందనలు వినలేకపోయాడు, రామదాసు. వాళ్ళని సముదాయించడానికి రామకృష్ణ ప్రయత్నిస్తూ వుండటం చూసి, కొంత తృప్తి పడ్డాడు.

పోలీస్ వేన్ కదిలింది. రామకృష్ణతోపాటు అందరూ యింట్లోకి నడిచారు.

అక్కడ చేరిన జనం యేవేవేమిటో అంటున్నారు. అవన్నీ వినడం కష్టమనిపించి తలుపు మూసింది రమ. ఆమె హృదయం మౌనంగా యేడ్చింది.

* జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 1973 *

**

I.V.R. MOORTY BOOK SHOP
NEWS & BOOK SELLERS
CHINNA BAZAR
SRIKAKULAM-532 001.